సాక్షి రంగారెడ్డి

మంగళవారం, 24, సెప్టెంబర్, 2024



బంతి సాగు..లాభాలు బాగు

బంతిపూల సాగుతో అధిక దిగుబడితో పాటు అంతే స్థాయిలో లాభాలు పొందొచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. 8లో▸



నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. 8లో▸



హై లెవల్ కమిటీ

'గ్రేటర్' వాసులకు ట్రాఫిక్ కష్టాలు తప్పించడానికి ఉన్నతాధికారులు సమాయత్తమయ్యారు. 8లో▸

న్యూస్‌రీల్

వేంనరేందర్‌రెడ్డిని కలిసిన గడ్డిఅన్నారం పాలకవర్గం



వేంనరేందర్‌రెడ్డిని సత్కరిస్తున్న మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు

అబ్దుల్లాపూర్‌మెట్: గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి పాలకవర్గంతో కలిసి సోమవారం సీఎం సలహాదారుడు వేంనరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కరాచారి, డైరెక్టర్లు మేకం లక్ష్మి, మచ్చేందర్ రెడ్డి, అంజయ్య, రఘుపతి రెడ్డి, గణేశ్ నాయక్, నరసింహ, బండి మధుసూదన్ రావు, నవరాజ్, గోవర్ధన్ రెడ్డి, వెంకట్ గుప్తా, జైపాల్ రెడ్డి, ఇబ్రహీం పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించండి

అధికారులకు కలెక్టర్ శశాంక ఆదేశం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణి ఫిర్యాదులను ప్రాధాన్యతా క్రమంలో సత్వరమే పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ శశాంక అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 62 అర్జీలు అందాయి. నేరుగా వాటిని స్వీకరించిన కలెక్టర్ అనంతరం మాట్లాడారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ.. సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రజాపాలన నుంచి జిల్లాకు వచ్చిన ఫిర్యాదులను సైతం వెనువెంటనే పరిష్కరించాలన్నారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని, దరఖాస్తుల వివరాల నమోదుకు రిజిస్టర్ నిర్వహించాలని సూచించారు. నమోదైనవి ఎన్ని, పరిష్కరించినవి ఎన్ని, పెండింగ్‌లో ఉన్నవెన్ని అని ఎప్పటికప్పుడు తెలియజేయా లని అన్నారు. ప్రజావాణికి వచ్చేటప్పుడు ఆయా శాఖల జిల్లా అధికారులు రిజిస్టర్ తీసుకొని హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆమనగల్లు ఠాణాను తనిఖీ చేసిన ఏసీపీ



పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి

ఆమనగల్లు: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను సోమవారం షాద్‌నగర్ ఏసీపీ ఎన్‌సీహెచ్ రంగస్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లో నమోదవుతున్న క్రైంరేటు వివరాలు, చోరీ కేసుల్లో రికవరీ తదితర విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రజలతో సఖ్యతగా మెలగాలని సూచించారు. సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్ఐ వెంకటేశ్, ఏఎస్ఐలు యాదయ్య, బాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

30న జిల్లాస్థాయి యువ కళాకారుల ఎంపిక

హుడాకాంప్లెక్స్: 28వ జాతీయ యువజనోత్సవాల సందర్భంగా ఈ నెల 30న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి యువ కళాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి వెంకటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే వారి వయస్సు 15 నుంచి 29 సంవత్సరాల లోపు ఉండాలని, జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం పొందిన కళాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు. అక్కడ ఎంపిక చేసిన ఉత్తమ కళాకారులు జనవరి 12 నుంచి 16వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొంటారన్నారు. జానపద సంగీతం, జానపద నృత్యం, కథ రచన, పెయింటింగ్, కవిత్వం, యువకృతి, సైన్స్ మేళా విభాగాల్లో ఎంపిక పోటీలు ఉంటాయని, ఇతర వివరాలకు 98499 09077 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

అంచనాలతో సరి!

పరిహారం ఏదీ మరి?

- ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలు, కూలిన ఇళ్లు
- 976 మంది రైతులు.. 1,194 ఎకరాల్లో పంట నష్టం
- ప్రభుత్వానికి నివేదించిన జిల్లా వ్యవసాయ, రెవెన్యూ అధికారులు
- ఇప్పటివరకు అందని ఆర్థిక సాయం ● ఆందోళనలో బాధితులు



చిత్రంలో కనిపిస్తున్న ఈ రైతు పేరు ఎండీ హైమద్. కొందుర్గు మండలం ఉత్రాస్‌పల్లికి చెందిన ఇతను తనకున్న ఆరు ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. ఇప్పటివరకు రూ.లక్షకుపైగా ఖర్చు చేశాడు. మొక్క ఏపుగా ఎదిగి, మంచి దిగుబడి ఇస్తుందని ఆశించాడు. తీరా ఇటీవల కురిసిన ఏకధాటి వర్షాలకు మొక్క నల్లగా వాడిపోయింది. పూత, పిందె రాలి పోయింది. దిగుబడి అటుంచి పెట్టిన పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని, పరిహారం అందలేదని వాపోతున్నాడు.





వరుస వర్షాలకు కొందుర్గులో పాడైన పత్తి చేను

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఏకధాటి వర్షాలు, వరదలకు ఇళ్లు కూలి రోడ్డున పడ్డ బాధితులకు, పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు పైసా సాయం అందలేదు. జిల్లా వ్యవసాయ, రెవెన్యూశాఖల అధికారులు అంచనాలు రూపొందించి నివేదిక పంపినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ఆపదలో అండగా నిలవాల్సిన ప్రజాప్రతినిధులు సైతం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉంటే ఇల్లు కూలిన బాధితులకు రూ.16,500 ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు ప్రకటించినప్పటికీ కేవలం రూ.3,500తోనే సరిపెట్టారు. రైతుకు మాత్రం నిరాశే మిగిలింది.

అపార నష్టం.. అరకొర సాయం

అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలోని కొందుర్గు, ఫరూఖ్‌నగర్, నందిగామ, తలకొండపల్లి, చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, షాబాద్ మండలాల్లో 1,194 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. అత్యధికంగా 969 ఎకరాల్లో పత్తి దెబ్బతింది. వరి 80 ఎకరాలు, కంది ఏడు ఎకరాలు, టమోటా పది ఎకరాలు, బీట్‌రూట్, బంతి రెండు ఎకరాలు, మొక్కజొన్న 20 ఎకరాలు, జొన్న 24 ఎకరాలు పాడయ్యాయి. ఒక్క కొందుర్గులోనే 700 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. అనధికారిక లెక్కల ప్రకారం ఇది మరింతగా ఉన్నట్లు అంచనా. ఆరుగాలం శ్రమించిన రైతును.. లాభాల కంటే నష్టాలే ఎక్కువగా కుంగదీస్తున్నాయి. ఇక తలకొండపల్లి మండలంలో 14 ఇళ్లు నేలమట్టం అయ్యాయి. ఇళ్లు కూలి ఒక్కో బాధితుడు రూ.3 లక్షల నుంచి రూ.5లక్షలకుపైగా నష్టపోతే అరకొర సాయం అందజేసి చేతులు దులుపుకొన్నారు. మిగిలిన మొత్తం బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని చెప్పి వెళ్లిపోయారు. ఆ తర్వాత ఆయా అధికారులను ఆశ్రయిస్తే.. సరైన సమాధానం రావడం లేదని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిలువనీడ లేకుండా పోయింది



ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు నాకున్న రెండు గదుల ఇల్లు పూర్తిగా కూలిపోయింది. వంట సామాగ్రి, ఆహార పదార్థాలు వరదలో కొట్టుకుపోయాయి. రూ.3 లక్షల నష్టం జరిగింది. తల దాచుకోడానికి నిలువ నీడ లేకుండాపోయింది. ఇప్పటి వరకు ప్రభుత్వ పరంగా ఎలాంటి ఆర్థిక సాయం అందలేదు.

– పోతుగంటి పెంటయ్య, తలకొండపల్లి

రూ.5 లక్షలు నష్టం



వారం రోజుల పాటు ఆగకుండా కురిసిన వర్షానికి నా ఇల్లు కూలిపోయింది. రెండు రూంల రేకులు, గోడలు, పైకప్పు దూలాలు పూర్తిగా దెబ్బతిని ధ్వంసమైపోయాయి. వంట సామగ్రితో పాటు ఆహార పదార్థాలు పాడై తీవ్ర నష్టం జరిగింది. రూ.5 లక్షల మేర నష్టపోయాను. డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలి.

– యాదయ్య, చంద్రధన

పైసా ఇవ్వలేదు



ముట్పూర్‌లో నాకున్న రెండున్నర ఎకరాల్లో పత్తిసాగు చేశాను. పూత, కాత దశకు వచ్చింది. ఇప్పటి వరకు రూ.60 వేలకుపైగా ఖర్చు చేశాను. మంచి దిగుబడి వచ్చి, అప్పులన్నీ తీరిపోతాయని భావించాను. అకాల వర్షం అపార నష్టాన్ని మిగిల్చింది. అధికారులు వచ్చి చూసి వెళ్లారే కానీ పైసా సాయం చేయలేదు.

– ఎం.వెంకట్‌రెడ్డి, కొందుర్గు



చెరువులను పరిశీలించి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న హైడ్రా ఆర్ఎఫ్ఓ పాపయ్య

'పట్నం' చెరువులపై హైడ్రా నజర్

- అక్రమ నిర్మాణాలను పరిశీలించిన అధికారులు

ఇబ్రహీంపట్నం: పట్నం పెద్ద,చిన్న చెరువులు, అక్కడి అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు సోమవారం పరిశీలించారు. తొలిసారి ఔటర్ రింగు రోడ్డును దాటి రావడంతో కబ్జాదారుల్లో వణుకు పుట్టింది. పెద్దచెరువును అంటిపెట్టుకొని ఉన్న చిన్న చెరువుతోపాటు ఉప్పరిగూడ,పోచారం,చర్లపటేల్‌గూడలో అక్రమ నిర్మాణాలను హైడ్రా ఆర్ఎఫ్ఓ పాపయ్య ఇరిగేషన్ డిప్యూటీ డీఈ ఉషారాణి, ఏఈ రాజ్యలక్ష్మి, ఏసీపీ కేపీవీ రాజు, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. చిన్న చెరువు, బఫర్ జోన్‌లో ఇళ్ల నిర్మాణం చేసుకున్న వారు హైడ్రా అధికారులు వచ్చారన్న విషయం తెలియగానే ఆందోళనకు గురయ్యారు. తమ పరిస్థితిని వారికి వివరించారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణం చేసుకున్న వారి జోలికి వెళ్లమని, కొత్త నిర్మాణాలు ఎవరూ చేపట్టొద్దని అధికారులు తెలిపారు. వారం రోజుల్లో చిన్న చెరువు, పెద్ద చెరువుల విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ వివరాల నివేదికలను పంపించాలని ఇరిగేషన్ అధికారులు ఉషారాణి, రాజ్యలక్ష్మిని హైడ్రా ఆర్ఎఫ్ఓ పాపయ్య ఆదేశించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో జరిగిన నిర్మాణాలు, చెరువులోకి వరదనీరు తీసుకొచ్చే ఫిరంగి, పెద్ద కాలువలు ఏ మేర కబ్జాలకు గురయ్యాయో పూర్తి వివరాలు అందజేయాలని సూచించారు. కొత్తగా నిర్మాణాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. కాగా, ఎఫ్‌టీఎల్‌లో ఉన్న నిర్మాణాలను తొలగించాలని అక్కడ నివాసం ఏర్పరుచుకున్న వారికి అధికారులు సున్నితంగా తెలియజేశారు.

పరిరక్షణలో భాగస్వాములు కండి

- బిల్డర్స్ అసోసియేషన్ సమావేశంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్

కూకట్‌పల్లి: చెరువులను కాపాడేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో బిల్డర్లు భాగస్వాములు కావాలని, భావితరాల భవిష్యత్ దృష్ట్యా చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమానికి సహకరించాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కోరారు. సోమవారం ఇక్కడి హోటల్ పద్మరాగ గ్రాండ్‌లో జరిగిన గ్రేటర్ వెస్ట్ సిటీ బిల్డర్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్, నాలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే, ఎంతటి వారినైనా వదలబోమని స్పష్టం చేశారు. హైడ్రా కూల్చివేతలతో ఎదురవుతున్న ఇబ్బందులను పలువురు బిల్డర్లు రంగనాథ్ దృష్టికి తీసుకెళ్లారు. బిల్డర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ మిరియాల రాఘవరావు, అధ్యక్షుడు కె.రాజారెడ్డి, జనరల్ సెక్రటరీ పీబీఎస్ విశ్వనాథ్, వైస్ చైర్మన్ సమ్మెట ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ స్వప్న శ్రీనివాస్ పాల్గొన్నారు.



రంగనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బిల్డర్స్



జ్యోతి వెలిగించి శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, మిషన్‌భగీరథ గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఆంజనేయులు

నీటిసరఫరాపై అవగాహన ఉండాలి

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మిషన్‌భగీరథ గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఆంజనేయులు
- మంచినీటి సహాయకులకు శిక్షణ ప్రారంభం

చేవెళ్ల: గ్రామాల్లో ఉండే వాటర్‌మెన్ నీటి సరఫరాతో పాటు మరమ్మతులపై అవగాహన కలిగి ఉండాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మిషన్‌భగరీథ గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఆంజనేయులు అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మండలంలోని గ్రామ మంచినీటి సహాయకులకు (వాటర్ మెన్) నాలుగురోజుల శిక్షణ తరగతులను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో నీటిని సకాలంలో, సక్రమంగా, ఎలాంటి ఇబ్బందులు రాకుండా అందించడంలో వాటర్‌మెన్ పాత్ర కీలకమన్నారు. అలాంటి వాటర్‌మెన్‌కు అన్ని విషయాలపై అవగాహన ఉండడం ఎంతో అవసరమన్నారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతుల్లో వారికి యంత్రాలు, మోటార్లు, వాటిని ఎలా ఉపయోగించాలి.. ఏదైనా సమస్య వస్తే ఎలా పరిష్కరించాలనే వాటిపై శిక్షణ ఇస్తారని తెలిపారు. వీటిని వాటర్‌మెన్‌లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొదటి రోజు చేతిపంపుల వాడకం, మరమ్మతులపై గ్రామీణ వాటర్ సప్లై ఎస్ఈ అంజనేయులు, జిల్లా ఈఈ రాజేశ్వర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మిషన్‌భగీరథ డీఈ హారిక, గ్రిడ్ డీఈ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ హిమబిందు, డివిజన్ ఏఈలు గీతా స్రవంతి, చంద్రమోహన్‌రెడ్డి, గంగా తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో..

మొయినాబాద్‌రూరల్: గ్రామాల్లో తాగునీటి సరఫరాపై మంచినీటి సహాయకులు అవగాహన పెంచుకోవాలని మిషన్‌భగీరథ గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఆంజనేయులు, జిల్లా ఈఈ రాజేశ్వర్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మిషన్ భగీరథ డీఈ హారిక, ఏఈ ఇమ్రాన్ అహ్మద్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని 28 పంచాయతీలకు మంచినీటి సరఫరా చేసే సహాయకులకు నాలుగు రోజుల శిక్షణను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

టీజీసెట్-2024 ప్రాథమిక 'కీ' విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: టీజీ సెట్-2024 ప్రాథమిక 'కీ'ని అధికారులు తాజాగా విడుదల చేశారు. అభ్యర్థులు ప్రశ్న, జవాబుల్లోని అభ్యంతరాలను నేటి నుంచి (24న) ఈ నెల 26 వరకు ఆన్‌లైన్ ద్వారా తెలియజేయాలని సూచించారు. హాల్‌టికెట్ నంబర్, పుట్టిన తేదీ ద్వారా వెబ్‌సైట్‌లో అభ్యంతరాలు తెలపాలని పేర్కొన్నారు. అభ్యంతరాలను www.teanfanaret.orf అనే వెబ్‌సైట్ ద్వారా టీజీసెట్-2024కు తెలియజేయాలని సూచించారు.

పొట్టి శ్రీరాములు పేరును తొలగించొద్దు

- తెలుగు విశ్వవిద్యాలయం పేరును యథాతథంగా కొనసాగించాలి
- ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ



కలెక్టరేట్ ఎదుట ఆర్యవైశ్యుల ధర్నా

ఇబ్రహీంపట్నం: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును తొలగించొద్దని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా ఆర్యవైశ్యులు ధర్నా నిర్వహించారు. కలెక్టర్ శశాంకకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అమరవాది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు ఏ ప్రాంతానికో, రాష్ట్రానికో చెందిన వ్యక్తికాదని దేశం గర్వించదగ్గ మహానాయకుడన్నారు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆద్యుడేకాక స్వాతంత్రోద్యమంలో చురుగ్గా పాల్గొని మహాత్మాగాంధీ నుంచి ప్రశంసలు అందుకున్న విషయాన్ని గుర్తుచేశారు. తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును తొలగించి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరును పెట్టాలని రేవంత్ సర్కార్ నిర్ణయించడాన్ని యావత్ ఆర్యవైశ్యులతోపాటు తెలుగు భాషాభిమానులు తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణకు సురవరం ప్రతాప్‌రెడ్డి అందించిన సేవల జ్ఞాపకార్థం వేరే ఏదైనా కొత్త ప్రాజెక్ట్‌కు ఆ పేరు పెట్టి సుముచిత గౌరవం కల్పించాలని సూచించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని భావితరాలకు తెలియజేప్పేలా తెలుగు విశ్వవిద్యాలయానికి యథాతథంగా ఆ పేరునే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్యవైశ్యుల, తెలుగు భాషాభిమానుల మనోభావాలు దెబ్బతినకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దీనిపై పునరాలోచన చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ చైర్మన్ చింతల రవికుమార్, జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి వెంకటేశం, ప్రధాన కార్యదర్శి గాంధీ సురేష్, కోశాధికారి బి.కిరణ్, నాయకులు ఏ.లక్ష్మయ్య, పాల మధుసూదన్, రవికుమార్, ఏ.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యటిస్తూ.. పరిశీలిస్తూ..

కార్పొరేటర్ల అధ్యయనయాత్ర

- యూపీ సీఎంను కలిసిన మేయర్ బృందం
- షిల్లాంగ్‌లో డిప్యూటీ మేయర్ బృందం



యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో మేయర్ బృందం

సాక్షి, సిటీబ్యూరో: మేయర్, డిప్యూటీ మేయర్ల నేతృత్వంలో కార్పొరేటర్ల అధ్యయన యాత్ర ఉత్సాహపూరిత వాతావరణంలో సాగుతోంది. రెండు బృందాల కార్పొరేటర్లు సోమవారం లక్నో, షిల్లాంగ్‌లలో పర్యటించారు. మేయర్ బృందంలోని 40 మంది కార్పొరేటర్లు లక్నో స్మార్ట్‌సిటీ కార్యాలయాన్ని సందర్శించి అక్కడి మూడు కమాండ్ సెంటర్ల కార్యకలాపాలను పరిశీలించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కమాండ్ సెంటర్ నుంచి ఇంటింటి చెత్త సేకరణ పర్యవేక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. సేఫ్ సిటీ కమాండ్ సెంటర్ నుంచి ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్, స్త్రీలపై వేధింపులు, అత్యాచారాలు జరగకుండా నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు గుర్తించారు. అక్కడి ఆర్టీసీ బస్సులలో కూడా కెమెరాలు ఉండటాన్ని, మహిళలకు ఏదేని సహాయం అవసరమైతే పానిక్ బటన్‌ను నొక్కినట్లైతే కమాండ్ కంట్రోల్ సెంటర్ సిబ్బంది వెంటనే స్పందించి వారికి సహాయం అందిస్తున్న తీరును గుర్తించారు. ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్మెంట్ కమాండ్ సెంటర్‌లోని సీసీ కెమెరాల ద్వారా అన్ని ట్రాఫిక్ జంక్షన్లను పర్యవేక్షిస్తున్నట్లు గుర్తించారు. అనంతరం మేయర్, కార్పొరేటర్లు యూపీ దర్శన్ పార్క్‌గా పిలవబడే వేస్ట్ టూ వండర్ పార్కును సందర్శించారు. లక్నో పర్యటనలో భాగంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి నేతృత్వంలోని కార్పొరేటర్ల బృందం ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను కలిసింది. జీహెచ్‌ఎంసీలో అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాల గురించి మేయర్ విజయలక్ష్మి వివరించారు. డిప్యూటీ మేయర్ శ్రీలత ఆధ్వర్యంలోని కార్పొరేటర్లు షిల్లాంగ్‌లో, స్వచ్ఛ గ్రామంగా పేరొందిన మాఫ్లీనాంగ్‌లో పర్యటించారు. ఆసియాలోనే అత్యంత పరిశుభ్ర నగరంగా గుర్తింపు పొందిన మాఫ్లీనాంగ్‌లో గ్రామస్తులు పరిశుభ్రత కోసం అనుసరిస్తున్న విధానాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ

బంజారాహిల్స్: వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హెచ్చరించారు. సోమవారం ఆయన బంజారాహిల్స్ రోడ్ నెం.7లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని హాజరు పట్టిక పరిశీలించి పర్మనెంట్, తాత్కాలిక సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ఆలస్యంగా రావడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వైద్య సిబ్బంది విజయలక్ష్మి సూపర్‌వైజర్ స్టాఫ్(పబ్లిక్ హెల్త్ నర్స్), నాగలక్ష్మి, పార్వతి ఏఎన్ఎంలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, రోగుల పట్ల స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఆసుపత్రిలో టెస్టుల వివరాలు, బ్లడ్ శాంపుల్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలోని ఫార్మసీ కేంద్రం సందర్శించి మందులను పరిశీలించారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమం లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగ కార్తీక్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ అనుదీప్

ప్రజావాణి అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

సాక్షి,సిటీబ్యూరో: ప్రజావాణి అర్జీలు సత్వరమే పరిష్కరించాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 147 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. అందులో గృహ నిర్మాణ శాఖకు 91, పింఛన్లు 23, భూ సమస్యలు 8,గ్యాస్ సబ్సిడీ 3 ఇతరములు 22 వచ్చాయన్నారు. సంబంధిత శాఖల అధికారులు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పరిష్కరించాలని సూచించారు.



లైంగికదాడి బాధితురాలికి మంత్రి పరామర్శ

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లైంగిక దాడి బాధితురాలిని మంత్రి సీతక్క సోమవారం రాత్రి పరామర్శించారు. కుమురంభీం ఆసీఫాబాద్ జిల్లా జైనూర్‌లో ఈనెల 1న ఓ ఆటోడ్రైవర్ ఆదివాసి మహిళపై అత్యాచారానికి యత్నించిన ఘటనలో గాయపడిన బాధితురాలిని మరింత మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రిలో చేర్పించిన సంగతి విదితమే. గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి నేతృత్వంలో డిప్యూటీ సూపరింటెండెంట్, ప్లాస్టిక్ సర్జరీ హెచ్ఓడీ ప్రొఫెసర్ సుబోధ్ కుమార్ బాధితురాలి ముఖానికి పలుమార్లు సర్జరీ చేయగా ఆమె కోలుకుంది. మంత్రి సీతక్క బాధితురాలిని పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గాంధీ ఆస్పత్రి వైద్యులు మెరుగైన వైద్యం అందించడంతోనే తాను ప్రాణాలతో బయటపడ్డానని బాధితురాలు మంత్రికి తెలిపింది. పూర్తిగా కోలుకునేంత వరకు ఇక్కడే ఉంటానని, ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లనని స్పష్టం చేసింది. బాధితురాలికి సొంత ఖర్చుల నిమిత్తం కొంత ఆర్థికసాయం అందించిందిన మంత్రి సీతక్క, మెరుగైన వైద్యసేవలు అందించిన గాంధీ వైద్యులను అభినందించారు.



బంతి సాగు.. లాభాలు బాగు

- తక్కువ పెట్టుబడి.. అధిక దిగుబడి
- పూల సేద్యంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి



షాబాద్: నీటి వసతి కలిగిన ప్రాంతం బంతి పూల సాగుకు అనుకూలమైనది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులతో పాటు అంతే స్థాయిలో లాభాలు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఈ సాగులో డ్రిప్ పద్ధతిని అనుసరిస్తే.. నీటిని కూడా పొదుపు చేయవచ్చునని పేర్కొంటున్నారు. మార్కెట్లో బంతికి ఎక్కువగా డిమాండ్ ఉంటుందని, ప్రతి పూజాకార్యక్రమాలు, వివాహాలు, గృహప్రవేశాలు తదితర వాటిల్లో విధిగా బంతిని వినియోగిస్తారని వెల్లడించారు. తక్కువ నీటి వనరులతో బంతిని సాగు చేస్తూ.. సస్యరక్షణ చేపడితే రైతులకు లాభాల పంటేనని మండల వ్యవసాయ అధికారి వెంకటేశం స్పష్టంచేస్తున్నారు. ఆయన తెలిపిన సూచనలు, సలహాలు ఇలా ఉన్నాయి.


సర్దార్‌నగర్ గ్రామంలో బంతి పూల తోట

సలహాలు.. సూచనలు

బంతి పూలలో ఆఫ్రికన్ బంతి, ఫ్రెంచ్ మేరీ గోల్డ్ రకాలు ఉన్నాయి. నీటి వసతి కలిగిన అన్ని కాలాలు వాటి సాగుకు అనుకూలం. సారవంతమైన గరప నేలలు, నీరు త్వరగా ఇంకిపోయే నేలలు పంటకు తగినవి. పూలు ఏపుగా పెరిగినప్పటికీ ఉత్పత్తి తగ్గే అవకాశాలు ఉన్నాయి. బంతి సాగుకు విత్తనాల ద్వారా కానీ, కత్తిరింపుల ద్వారా కానీ ప్రవర్ధనం చేయవచ్చు. ఎకరానికి వెయ్యి గ్రాముల విత్తనాలు అవసరం అవుతాయి. మడులను తయారు చేసి విత్తనాలను చల్లుకోవాలి. మడులను తయారు చేసే సమయంలో ఎకరానికి 20 టన్నులు బాగా చివికిన పశువుల ఎరువు వేసి కలియ దున్నుకోవాలి. దీంతో పాటు 20 నుంచి 40 కిలోల నత్రజని, 80 కిలోల భాస్వరం, 80 కిలోల పొటాష్‌ను వేసుకోవాలి. నాటిన 37 రోజులకు 20 నుంచి 40 కిలోల నత్రజనిని వేసి నీరు పెట్టుకోవాలి. పాలిడాల్ పొడి చల్లడం వలన చీమలు, చెదలను నివారించుకోచ్చు. విత్తిన విత్తనాలు వారం రోజుల్లో మొలకెత్తుతాయి. నెల వయసు కలిగిన బంతి మొక్కలు నాటుకోవడానికి అనుకూలంగా ఉంటాయి. నాటుకు వచ్చిన నారును సాయంత్రం వేళల్లో నాటుకోవాలి.

నీరు పెట్టుకునే విధానం

నాటిన 60 రోజుల తర్వాత పూత దశ వచ్చే వరకు నేలల్లో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి. నీటి ఎద్దడితో దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉంది.

సస్యరక్షణ చర్యలు

పేను.. పూల మొగ్గలను ఆశించి నష్ట పరుస్తాయి. వీటి నివారణకు లీటర్ నీటికి మోనోక్రోటోఫాస్ 1.5మి.లీ. కలిపి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. తామర పురుగులు.. ఆకులు, పూల నుంచి రసాన్ని పీల్చి నష్టం కలిగిస్తాయి. ఆకులపై తెల్లని మచ్చలు ఏర్పడతాయి. మొగ్గలు గోధుమ రంగుకు మారి ఎండిపోతాయి. వీటి నివారణకు మోనోక్రోటోఫాస్ 1.5 మి.లీ. లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మొగ్గతొలిచే పురుగులు.. లార్వాలు పూల మొగ్గలను తొలుస్తాయి. వీటి నివారణకు ఎండోసల్ఫాన్ 2 మి.లీ. లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

తెగుళ్ల నివారణ

నీటి తడి ఎక్కువగా ఉండి, వేడిగా ఉన్న చోట నారుకు కుళ్లు తెగులు వ్యాపిస్తుంది. తద్వారా లేత మొక్కలు చనిపోతాయి. మడులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలి. నేలను లీటర్ నీటికి 2 గ్రా. కాప్టాన్ మందుతో తడపాలి. ఆకు మచ్చ తెగులు.. మొక్కల్లో బూడిద రంగు, లేదా నల్లని మచ్చలు ఏర్పడతాయి. లీటర్ నీటికి 2.5 గ్రా. మాంకోజెబ్ కలిపి పిచికారీ చేసుకోవాలి.

విచ్చుకున్న తరువాతే కోయాలి

బంతి పూలు బాగా విచ్చుకున్న తర్వాతనే కోయాలి. కోతకు ముందు నీటి తడులు ఇచ్చినట్లయితే.. పుష్పాలు ఎక్కువ సమయం తాజాగా ఉంటాయి. పూలను ఉదయం లేదా సాయంత్రం వేళల్లో మాత్రమే కోయాలి. సాధారణంగా ఎకరానికి నాలుగు నుంచి ఐదు టున్నుల దిగుబడి వస్తుంది.

'పట్నం'కు జన్మదిన శుభాకాంక్షలు

ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య.. నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీటీడీ ప్రసాదం అందజేశారు. అనంతరం ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ చైర్‌పర్సన్ నిర్మలను ఆమె చాంబర్‌లో కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఎం.కృష్ణారెడ్డి, వీరేందర్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

– చేవెళ్ల


ఎమ్మెల్సీ పట్నంకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య


చైర్‌పర్సన్ నిర్మలకు పుష్పగుచ్ఛం అందజేసిన ఎమ్మెల్యే కాలె

డ్రగ్స్ పట్టివేత

పోలీసుల అదుపులో యువకులు

ఇబ్రహీంపట్నం: డ్రగ్స్ తీసుకుంటూ ముగ్గురు యువకులు పట్టుబడ్డారు. ఏసీపీ కేపీవీ రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం ఇబ్రహీంపట్నంలోని బృందావన్ కాలనీలో డ్రగ్స్ తీసుకుంటున్న ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 250 గ్రాముల గంజాతో పాటు ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఏసీపీ తెలిపారు.

మద్యం దుకాణం తరలించండి

కందుకూరు: పాఠశాలకు చేరువలో మద్యం దుకాణం ఉండటం వలన విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, షాపును అక్కడి నుంచి తరలించాలని బీజేపీ నాయకుడు సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. ఇదే విషయమై.. సంబంధిత శాఖ అధికారులకు గతంలో ఫిర్యాదు చేశామని, అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని సురేందర్ ఆరోపించారు.

గోవా కేంద్రంగా క్రికెట్ బెట్టింగ్ దందా..

సుల్తాన్‌బజార్: గోవా కేంద్రంగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్స్ నిర్వహిస్తున్న ఓ ముఠా గుట్టు రట్టు చేశారు. సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎంజేమార్కెట్ రోడ్డులోని వాల్‌స్ట్రీట్ అపార్ట్‌మెంట్‌కు చెందిన వికాస్ జైన్ (41) మెజిస్ట్రీట్ ట్రైడ్ గోవా ఏజెంట్‌గా బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. అతను విక్రమ్, సాగర్, మరికొందరితో కలిసి గోవా కేంద్రంగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. దీనిపై సమాచారం అందడంతో సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు వికాస్ జైన్‌ను అరెస్టు చేసి అతడి వద్ద రూ.8 లక్షల నగదు, మొబైల్‌ఫోన్, బైక్, నగదు కౌంటింగ్ మిషన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని సుల్తాన్‌బజార్ పోలీసులకు అప్పగించారు.

బ్యాంక్ చైర్మన్‌పై ఫోర్జరీ కేసు

బంజారాహిల్స్: కొటక్ మహీంద్ర బ్యాంక్ లిమిటెడ్ చైర్మన్ ప్రకాష్ ఆప్టే, ఎండీ ఉదయ్ కోటక్‌తో పాటు మరో 5 మందిపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫోర్జరీ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–70లోని అశ్విని లేఅవుట్, ప్రశాసన్‌నగర్‌లో నివసించే జి.అర్మితారెడ్డి అప్పటి ఐఎన్‌జీ వైశ్యా బ్యాంక్ హిమాయత్‌నగర్ బ్యాంక్‌లో హౌసింగ్ లోన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. సరిగ్గా ఆమెకు హౌసింగ్ లోన్ మంజూరయ్యే సమయానికి ఐఎన్‌జీ వైశ్యా బ్యాంక్ కోటక్ మహీంద్ర బ్యాంక్‌లో విలీనమైంది. తనకు రుణం మంజూరైందని సమాచారంఅందడంతో ఆమె కోటక్ మహీంద్రబ్యాంక్ సోమాజీగూడ బ్రాంచ్‌ను ఆశ్రయించగా అక్కడి బ్యాంక్ అధికారులు ఆమె నుంచి ఖాళీ కాగితాలపై సంతకాలు తీసుకున్నారు. ఆ సమయంలో వడ్డీ రేటు ఒక రకంగా చెప్పి ఆ తర్వాత అదనపు వడ్డీ రేట్లను నిబంధనలకు విరుద్ధంగా ఆమెకు తెలియకుండా వేశారు. ఉద్దేశపూర్వకంగా ఫోర్జరీ డాక్యుమెంట్లతో ఒప్పందాలను ఉల్లంఘించి తనను మోసం చేశారంటూ బాధితురాలు 2020 జనవరి 7న జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు రాగా పోలీసులు ఆమె ఫిర్యాదును స్వీకరించలేదు. దీంతో ఆమె 17వ అదనపు చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్‌ను ఆశ్రయించారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కోటక్ మహీంద్ర బ్యాంక్ చైర్మన్ ప్రకాష్ ఆప్టే, ఎండీ ఉదయ్ కోటక్, సోమాజీగూడ బ్రాంచ్ మేనేజర్ జే ప్రదీప్‌కుమార్, హిమాయత్‌నగర్ రీజనల్ మేనేజర్ ఎస్.ప్రశాంత్‌కుమార్, సోమాజీగూడ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఆర్.రామచంద్రన్, బ్యాంక్ అధికారి సుధీర్, ఉద్యోగి గుత్తా ఈశ్వర్‌లపై కేసు నమోదు చేశారు. తాను ఈ లోన్ కోసం ఎన్నోసార్లు బ్యాంక్ అధికారుల చుట్టూ తిరిగానని, న్యాయం జరగలేదని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దురుద్దేశపూర్వకంగా తనను మోసం చేశారంటూ ఆమె ఆరోపించారు. తన నుంచి ఖాళీ పేపర్లు, బ్లాంక్ చెక్కులు తీసుకున్న అధికారులు ఇప్పటివరకు వాటిని తిరిగి ఇవ్వలేదన్నారు. తన నుంచి బౌన్స్ చార్జెస్ అక్రమంగా వసూలు చేశారన్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ నిర్వహణకు హై లెవల్ కమిటీ

- భాగస్వాములుగా అన్ని విభాగాల అధికారులు
- అనునిత్యం సమావేశాలు, వర్క్‌షాప్‌ల నిర్వహణ
- వచ్చే ఏడాది కోసం సమగ్ర యాక్షన్ ప్లాన్‌కు రూపం
- కీలక సమావేశంలో నిర్ణయించిన ఉన్నతాధికారులు



సాక్షి, సిటీబ్యూరో: 'గ్రేటర్' వాసులకు ట్రాఫిక్ కష్టాలు తప్పించడానికి ఉన్నతాధికారులు సమాయత్తమయ్యారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీసు, జీహెచ్ఎంసీ, హైడ్రా విభాగాలు ఏకతాటి పైకి వస్తున్నాయి. దీనికి సంబంధించిన కీలక సమావేశం సోమవారం బంజారాహిల్స్‌లోని టీజీ సీసీసీలో ఉన్న హైదరాబాద్ కమిషనరేట్ కార్యాలయంలో జరిగింది. నగర కొత్వాల్ సీవీ ఆనంద్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ దీనికి నేతృత్వం వహించారు. రాజధానిలోని మూడు కమిషనరేట్లలో ఏకరూప స్పందన ఉండేలా, సమగ్ర ట్రాఫిక్ నిర్వహణ కోసం ఉన్నతాధికారులతో హై లెవల్ కమిటీ ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. వీళ్లు తరచూ సమావేశాలు, వర్క్‌షాపులు నిర్వహిస్తూ సమకాలీన అవసరాలకు తగ్గట్టు కార్యాచరణలు సిద్ధం చేయనున్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ అధికారులతో పాటు జీహెచ్ఎంసీ, హైడ్రా సమన్వయంతో పని చేయడం కోసం ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేయనున్నారు. దీని ఆధారంగా ఎప్పటికప్పుడు సమాచార మార్పిడి చేసుకోవడానికి ఆస్కారం ఏర్పడనుంది. హఠాత్తుగా కురిసే భారీ వర్షాలతో పాటు ఇతర విపత్తుల సమయంలో కీలక జంక్షన్ల వద్ద సాధారణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా, వారు సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. ప్రస్తుతం ట్రాఫిక్ సహా ఇతర విభాగాల అధికారులు వర్షం కురిసిన తర్వాత రోడ్ల పైకి వస్తున్నారు. అయితే అప్పటికే సమస్యాత్మక జంక్షన్లు జామ్ అయిపోవడంతో పాటు పరిస్థితులు చేతులు దాటేస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో అధికారులు అసలు చేరాల్సిన చోటుకు చేరలేకపోతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇకపై వాతావరణ శాఖ నుంచి హెచ్చరికలు వెలువడిన వెంటనే సమాచార మార్పిడి చేసుకుని క్షేత్రస్థాయిలోకి అధికారులు వెళ్లేలా చర్యలు తీసుకోనున్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పని చేస్తూ ట్రాఫిక్ డైవర్షన్లు, సూచక బోర్డులు తదితరాలు ఏర్పాటు చేయడంతో పాటు ఇంజినీరింగ్ మార్పులు చేస్తూ వాటర్ లాగింగ్ ఏరియాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు. ట్రాఫిక్ సమస్యల అంశంలో హై లెవల్ కమిటీ ఐటీ కంపెనీలను సంప్రదిస్తూ అవసరమైన చర్యలు తీసుకోనుంది. దీంతో పాటు రాజధానిలోని నీటి వనరుల్లో నీటి మట్టాలు, మార్పుచేర్పులను సైతం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటుంది. ఈ సమావేశంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, సైబరాబాద్, రాచకొండ కమిషనర్లు అవినాష్ మహంతి, జి.సుధీర్‌బాబు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిలతో పాటు మూడు కమిషనరేట్ల అధికారులు, బల్దియా జోనల్ కమిషనర్లు పాల్గొన్నారు. ఆయా అధికారులు నగరంలో ట్రాఫిక్, ముంపు, విపత్తు సమస్యల పరిష్కారానికి సంబంధించిన ప్రణాళికలు, ఆలోచనలు వివరించారు. వీటిలో తక్షణం అమలయ్యే వీలున్న వాటిపై అధికారులు దృష్టి పెట్టారు. దీర్ఘకాలిక ప్రణాళికల్లో భాగంగా ఓ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేస్తున్న ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదించనున్నారు.

యువతి అదృశ్యం


నందిని (ఫైల్)

పహాడీషరీఫ్: యువతి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘన్‌పూర్ మండలం పర్వతాపూర్ గ్రామానికి చెందిన వడ్డె రాఘవేందర్ కుటుంబం ఏడాది కాలంగా జీవనోపాధి నిమిత్తం దేవేందర్ కాలనీలో నివాసం ఉంటోంది. వీరి కుమార్తె నందిని(15) స్థానికంగా ఉండే బంధువుల ఇంట్లో టైలరింగ్ నేర్చుకునేందుకు రోజూ వెళ్తుంటుంది. ఈ నెల 10న కుటుంబ సభ్యులు పని నిమిత్తం బయటికి వెళ్లొచ్చే సరికి యువతి కనిపించలేదు. ఆమె ఆచూకీ కోసం ఎంత వెతికినా లభ్యం కాలేదు. దీంతో వారి గ్రామానికి చెందిన కదిరె రమేష్ అనే యువకుడిపై అనుమానం వ్యక్తంచేస్తూ.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. యువతి ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

విద్యుదాఘాతంతో పశువుల మృతి


పశువుల కళేబరాలు

మహేశ్వరం: విద్యుదాఘాతంతో రెండు పాడి పశువులు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మహేశ్వరం మండలం డబిల్‌గూడ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కర్ణం ప్రభాకర్ పాడి పశువులతో జీవనోపాధి పొందుతున్నాడు. రోజులాగే సోమవారం మూగ జీవాలను మేతకు వదలగా.. అవి మేత మేస్తూ.. తెగిపడిన విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందాయి. దీంతో బాధిత రైతు విలపిస్తూ.. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వలనే పశువులు చనిపోయాయని ఆరోపించారు. కరెంటు తీగల గురించి ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదని, వారి కారణంగానే రూ.1.40 నష్టపోయాయని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.